క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు


బెంగళూరు బస్సులు ఆపేందుకు ప్రత్యేకమైన స్థలాన్ని ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

పలమనేరు: పట్టణంలోని పోలీసుస్టేషన్ ఎదురుగా ఆర్టీసీ బస్టాండు రోడ్డు నుంచి సరస్వతి కేఫ్ దాకా నిత్యం ట్రాఫిక్ సమస్యగా ఉండడంతో పోలీసులు దృష్టి సారించారు. రోడ్డుపక్కన వాహనాలు ఆపకుండా మట్టిని తోలించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించారు. అలాగే బెంగళూరుకు వెళ్లే కర్ణాటక బస్సులు బస్టాండుకు వెళ్లకుండా మెయిన్‌రోడ్డుపై ఎక్కడపడితే ఇష్టానుసారంగా అక్కడ ఆపేవారు. దీనిమూలాన ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. దీంతో ఆ బస్సులకు రుచి–2 హోటల్ ఎదుట స్టాపింగ్‌కు చర్యలు తీసుకున్నారు. ఇక ట్రాఫిక్ సమస్య తీరనుంది.

ఎస్‌ఐగా సహదేవి



పలమనేరు: పలమనేరు ఎస్‌ఐగా సహదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న నాగరాజు చిత్తూరుకు బదిలీ అవడం విదితమే. వీఆర్‌లో ఉన్న సహదేవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తామని ఆమె తెలిపారు.

రొంపిచెర్ల ఎస్‌ఐగా కృష్ణయ్య



రొంపిచెర్ల: రొంపిచెర్ల ఎస్‌ఐగా కృష్ణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాస్‌ను రామకుప్పంకు, అక్కడ పని చేస్తున్న కృష్ణయ్యను రొంపిచెర్లకు బదిలీ అయ్యారు. ఎక్కడైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న పక్షంలో నిర్భయంగా తనకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రోటరీ సేవలు విస్తృతం చేస్తాం


రోటరీక్లబ్ సమావేశంలో కమిషనర్ నరసింహప్రసాద్, అనిల్‌కుమార్ తదితరులు

పుంగనూరు: రోటరీక్లబ్ సేవలు విస్తృతం చేసి, బడుగు బలహీన వర్గాలను ఆదుకుంటామని నూతన అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి రోటరీక్లబ్ నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు రాజారెడ్డి, డాక్టర్లు ప్రభాకర్, శరణ్, హరగోపాల్, పూల త్యాగరాజు, హరిప్రసాద్, భాస్కర్‌జెట్టి, గణేష్, ప్రవీణ్, అర్షద్ అలి, జాన్ పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి



పలమనేరు: కవి చక్రవర్తి గుర్రం జాషువా వర్ధంతి పురస్కరించుకుని పట్టణ సమీపంలోని కళామందిరంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు సోమవారం ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సాహితీసేవను స్మరించారు. రాజు కంటే కవి గొప్పవాడని చాటిన ధీశాలి జాషువా అని సమితి అధ్యక్షులు తుల సీనాథం నాయుడు కీర్తించారు. ఛీత్కారాలు పొందిన చోటే సత్కారాలందుకున్న కవికోకిల ఆ మహనీయుడన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పుష్ప, సభ్యులు పాల్గొన్నారు.

4 నుంచి రాయలసీమ ఆర్గానిక్ మేళా

తిరుపతి కల్చరల్: రైతు సాధికార సంస్థ, ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం సంయుక్తంగా ఇస్కాన్ రోడ్డులోని టీటీడీ మైదానంలో ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకు రాయలసీమ ఆర్గానిక్ మేళా–2023ను నిర్వహించనున్నట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుమారస్వామి తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆర్గానిక్ మేళా కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో సేంద్రియ వ్యవసాయానికి ఆదరణ పెరిగిందన్నారు. మార్కెటింగ్ చేసుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్గానిక్ మేళాకు పూనుకున్నట్టు తెలిపారు. ఇందులో ఆర్గానిక్ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు చేపడతామన్నారు. ఆగస్టు 3వ తేదీ ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి కాంప్లెక్స్ నుంచి టీటీడీ మైదానం వరకు ఆరోగ్య పరుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయ పరిశోధకులు గంగాధరం, నిర్వాహకులు ధనుంజయరెడ్డి, మనోహర్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

కుప్పంలో ఒక్క అవకాశం ఇవ్వండి

- 35 ఏళ్లుగా బాబు చేసింది శూన్యం
- అభివృద్ధి అంటే ఏమిటో కడపకు వెళ్లి చూడండి
- కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


వాన కురుస్తున్నా గరిగచీనేపల్లె సభలో వేచి ఉన్న జనం

కుప్పం/కుప్పం రూరల్: కుప్పంలో వైఎస్సార్ సీపీకి ఒక్క అవకాశం ఇస్తే పూర్తిస్థాయిలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతామని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పునరుద్ఘాటించారు. 35 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటూ, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్నా చంద్రబాబు కుప్పం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. జగన్ సీఎం అయ్యాక అభివృద్ధి అంటే ఎలా ఉండాలో కడపలో చేతల్లో చేసి చూపారన్నారు. ఎన్నికలప్పుడు కొత్త కొత్త హామీలు ఇవ్వడం, ఎన్నికల తరువాత వాటిని విస్మరించడం బాబుకు పరిపాటిగా మారిందని విమర్శించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇంటి ముంగిటకే పథకాలు తీసుకువచ్చారన్నారు. 1వ తేదీ ఉదయం 5 గంటలకే పెన్షన్ ఇస్తున్న ప్రభుత్వం తమదన్నారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ, నాయకుల సిఫార్సులు లేనిదే పథకాలు అందేవి కావని విమర్శించారు. కుప్పంలో ఎమ్మెల్యేగా భరత్, చిత్తూరు ఎంపీగా రెడ్డెప్పకు అవకాశం ఇస్తే పూర్తిస్థాయి అభివృద్ధి ఏమిటో చేసి చూపుతామని మరోసారి విజ్ఞప్తి చేశారు.


జోరు వానలో గొడుగు సాయంతో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

జోరు వానలోనూ 'పల్లెబాట'

మంత్రి కుప్పంలో సోమవారం నిర్వహించిన పల్లెబాట కార్యక్రమానికి వరుణుడు స్వాగతం పలికాడు. సగానికి పైగా సభలు వర్షంలోనే సాగాయి. అయినా మంత్రి ప్రజలను నిరాశ పరచకుండా గొడుగు పట్టుకుని ఓపిగ్గా వారి సమస్యలు ఆలకిస్తూ ముందుకుసాగారు. ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ ఏడీఎస్ శరవణ, వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు కృష్ణమూర్తి, నందకుమార్, శ్రీనివాసమూర్తి, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, నాయకులు మొగసాల కృష్ణమూర్తి, మొగసాల రెడ్డెప్ప, హెచ్ఎం మురుగేష్, ఎంఆర్‌సీ రెడ్డి, తిమ్మోజీ గౌడు, మురుగేష్, వెంకరామయ్య, కుమార్, నాసిర్, అబ్బాస్, ఈశ్వర్, రవి పాల్గొన్నారు.


వధూవరులకు పెళ్లి కానుక చెక్ పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ప్రజాప్రతినిధులు

నన్ను ఆశీర్వదిస్తే రుణం తీర్చుకుంటా



35 ఏళ్లుగా మీరు ఓటు వేస్తున్న వ్యక్తికి కుప్పంలో ఓటుగానీ ఇల్లు గానీ లేదు. మేము ఓడిపోయినా మా కుటుంబం మొత్తంలో ఉంటూ మీకు సేవ చేస్తున్నాం. నిత్యం మీ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నా. ఒక్కమారు నన్ను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతా. నేను పనులు చేయకపోతే చొక్కా కాలర్ పట్టుకుని నిలదీయండి. నాకు ఓటు వేస్తే రుణపడి ఉంటా.

–భరత్, చిత్తూరు ఎమ్మెల్సీ

బీసీలను మోసం చేస్తున్న బాబు



80 శాతం బీసీ సామాజిక వర్గాలు ఉన్న కుప్పంలో పోటీ చేస్తూ చంద్రబాబు బీసీలను మోసం చేస్తున్నాడు. రాష్ట్రంలో 60 శాతం బీసీలు ఉంటేనే జగన్‌మోహన్‌రెడ్డి పదవులన్నీ వారికి కట్టబెట్టి బీసీల పక్షపాతిగా నిలిచారు. బీసీ అయిన భరత్‌ను గెలిపించి సీఎంకు కానుక ఇవ్వాలి. కుప్పం బీసీలు, ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ప్రైవేట్ మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలు తెచ్చి దోచుకుంటున్న చంద్రబాబును నమ్మొద్దు.

– సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

ఆ వంచకుడిని నమ్మొద్దు



ఎన్నికల ముందు మహిళ, రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి దగా చేసిన వ్యక్తి చంద్రబాబు. రూ.14,200 కోట్ల రుణాలు కాస్త వడ్డీతో రూ.27 వేల కోట్లకు చేరిందని, విడతల వారీగా జగన్‌మోహన్‌రెడ్డి వాటిని చెల్లిస్తున్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి హామీతో చంద్రబాబు మోసగించారు. అలాంటి వంచకుడిని మళ్లీ నమ్మొద్దు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఉద్యోగాలు సీఎం ఇచ్చారు.

–గోవిందప్ప శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

ఓటమి భయంతో ఇల్లు నాటకం



35 ఏళ్లుగా కుప్పంలో గెలుస్తున్న బాబుకు ఏరోజు గానీ ఇక్కడ ఇల్లు కట్టుకోవాలనే ఆలోచన రాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రామచంద్రారెడ్డి భయంతో ఇల్లు కట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. సీఎం ప్రజారంజక పాలన, మంత్రి పెద్దిరెడ్డి కుప్పంకు చేస్తున్న సహకారం చూసి ఓడిపోతామనే భయం పట్టుకుంది. కుప్పంలో బాబు పనైపోయింది. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం.

– పోకల అశోక్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు

ఇంటింటికీ వెళ్లి సమస్యల పరిష్కారం


ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్మన్ అలీమ్ బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను అడిగి సమస్యలను పరిష్కరిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. సోమవారం పోలీస్ లేన్, తాటిమాకులపాళ్యం, కోర్టు దగ్గర, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాలలో కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలసి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చైర్మన్ నిర్వహించారు. 437 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. చైర్మన్ మాట్లాడుతూ, ఇప్పటికే పట్టణంలో 90 శాతం పథకాలు అందించి, ఆదర్శంగా నిలిచామన్నారు. సాంకేతిక కారణాలతో అర్హులకు పథకాలు అందని పక్షంలో వారిని గుర్తించి ఇచ్చేందుకు ఇంటింటికీ వెళ్తున్నామన్నారు. ఇప్పటి వరకు 4,939 సమస్యలు పరిష్కరించామన్నారు. సమస్యలు లేని మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, కౌన్సిలర్ నటరాజ, కన్వీనర్ వరదారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బరాయప్ప, జయకృష్ణ, నానబాల సురేష్, కవిత, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లెలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఆదాయ సముపార్జనలో భేష్

రొంపిచెర్ల: స్వయం సహాయక సంఘాలకు అధిక రుణాలు మంజూరు చేసి మండల స్థాయిలోనే బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని వీఓ–4 వడ్డీ రూపంలో అధిక ఆదాయం సాధించింది. వీఓ పరిధిలో 31 స్వయం సహాయక సంఘాలలోని 320 మంది సభ్యులకు రుణాలు మంజూరు చేయించారు. దీంతో వడ్డీ రూపేణా 2023–23 సంవత్సరానికి గాను రూ.4.33,147 ఆదాయం వచ్చిందని ఏపీఎం బ్రహ్మానందరెడ్డి సోమవారం నిర్వహించిన వీఓ సమావేశంలో ప్రకటించారు. గత 12 ఏళ్లుగా మొత్తం రూ.19,49,008 ఆదాయం రాగా ఒక ఏడాదికే రూ.4.33,147 ఆదాయం సాధించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా సంఘమిత్ర అరుణను పలువురు అభినందించారు. కార్యక్రమంలో బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోటా వెంకటరమణ, సీసీ వెంకట నారాయణరావు, స్వయం సహాయక సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఐకేపీ అధికారులు

కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ



జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన ధనుష్, చరణ్‌తేజతో రెడ్డి మహేష్

పుంగనూరు: పట్టణానికి చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో పతకాలు సాధించారని కరాటే మాస్టర్ రెడ్డి మహేష్ సోమవారం తెలిపారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో 12 ఏళ్ల విభాగంలో కార్తికేయ, మోహిత్, చరణ్, ధనుష్, చరణ్‌తేజ బంగారు, వెండి పతకాలు సాధించారని, వీరిలో ధనుష్, చరణ్ తేజ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారని ఆయన చెప్పారు. విద్యార్థులను పలువురు అభినందించారు.

బదిలీ టీచర్లకు వీడ్కోలు సన్మానం



ఉద్యోగోన్నతిపై ఎంఈఓగా వెళ్లిన తాతయ్యను సన్మానిస్తున్న మురళీధర్, పెద్దపంజాణి : రాజుపల్లెలో.. పెద్దపంజాణిలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూలు నుంచి బదిలీ, ఉద్యోగోన్నతిపై ఇతర ప్రాంతాలకు పది మంది టీచర్లు వెళ్లారు. సోమవారం వారికి వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఎంఈఓ సిద్ధరామయ్య, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, నాదమునిరెడ్డి, సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డి అహమ్మద్, ఎస్ఎంసీ చైర్మన్ రఫీ, ప్రసాద్, గోవిందరెడ్డి, రమణ,వెంకట సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె జెడ్పీ హైస్కూల్ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు నారాయణ, రెడ్డెమ్మ, అమరనాథ్, మోహన్‌ను హెచ్ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు సోమవారం వీడ్కోలు సన్మానం చేశారు. పలువురు వారి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టప్ప, శంకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు పంపిణీ


రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ

పలమనేరు: స్ప్లిట్టింగ్ చేసిన కొత్త రేషన్ కార్డులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, వార్డు కౌన్సిలర్ మురళీకృష్ణ సోమవారం కొత్తపేటలోని తన వార్డులో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల ధ్రువపత్రాలను కావాలనుకునే వారు సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకతాటిపై నడుద్దాం

వి.కోట: మండలంలోని బలిజ కులస్తులంతా ఏకతాటిపై నడిచి కులస్తుల అభివృద్ధికి కృషి చేద్దామని బలిజ సంఘ అధ్యక్షుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. సోమవారం కై వరం తాతయ్య ఆలయంలో బలిజ కులస్తుల వి.కోట పంచాయతీ కన్వీనర్లను ఎంపిక చేశారు. మేజర్ పంచాయతీ కన్వీనర్లుగా దాసార్లపల్లెకు చెందిన రమేష్, పత్రపల్లెకు చెందిన మురళిని ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బలిజ కులస్తులు సతీష్, మూర్తి, ముకుంద, పొట్టు భాస్కర, బాల గురునాథ్, ధీరజ్, నాగరాజేంద్ర, శబరీష్, నాని, సుబ్బన్న, శివ, రవి, జనార్ధన్ పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన బలిజ కులస్తులు

పేదల అభ్యున్నతికే నవరత్నాలు

- పార్టీలకతీతంగా పథకాల ఫలాలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: పేదల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ముత్తుకూరు, నెర్నిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 908 గృహాలను సందర్శించారు. నాలుగేళ్లలో వివిధ పథకాల రూపేణా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని, దోచుకుని పచ్చనేతలకు పంచిపెట్టిందని విమర్శించారు. తమ ప్రభుత్వం కులమతాలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇస్తోందన్నారు. ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారి విద్యారంగంలో సాధిస్తున్న అభివృద్ధి, విద్యావ్యవస్థలో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే సచివాలయాలతో ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే చేరుస్తున్నట్లు చెప్పారు. తమ ప్రభుత్వం పాలనలో చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురద చల్లుతూనే ఉన్నాయని, అయినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. ముత్తుకూరు బీసీ కాలనీలో కొత్తగా వేసిన మంచినీటి బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, పెద్దపంజాణి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పృథ్వి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు హరినాథ్, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, స్థానిక సర్పంచ్ వెంకట భార్గవ్, ఎంపీటీసీ పద్మ, మాజీ సర్పంచ్ వెంకటరత్నం, మాజీ ఎంపీటీసీ నరసింహులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

నేడు గడప గడపకు..

పోలేపల్లె, బ్రాహ్మణపల్లె, లింగాపురం, గడ్డంవారిపల్లె, రేకులకుంట, వీపీ కొత్తూరు, జోగిండ్లు, మట్టిగానిపల్లె, దాసనంపల్లెలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే నిర్వహిస్తారు.

కరోనాలో కొండంత ధైర్యం



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న వలంటీర్ కార్తిక్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ప్రజలతో మమేకమైంది. పింఛన్లు ఇవ్వడం మొదలుకుని ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే చేర్చడంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. తెలుగుదేశం పాలనలో దీనికి పూర్తిగా భిన్నం. అయితే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ల సేవలపై అనుచిత వ్యాఖ్యలు, దీనికి చంద్రబాబు తందానతాన అనడంపై వలంటీర్లు, ప్రజలు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ల సేవలపై సింహావలోకనం.

బైరెడ్డిపల్లె: ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు కార్తిక్. బైరెడ్డిపల్లె మండలం తీర్థం గ్రామంలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. కోవిడ్ మహమ్మారి అతలాకుతలం చేసిన రోజుల్లో కరోనా బాధితులకు విశేష సేవలు అందించాడు. తన పరిధిలో పలువురు కోవిడ్ బారిన పడడంతో వారిని క్వారంటైన్ సెంటర్‌కు తరలించారు. బాధితుల ఇళ్ల చుట్టూ బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశాడు. హోమ్ క్వారంటైన్‌లో ఉన్న వారికి ప్రభుత్వం సరఫరా చేసిన మందులు అందజేశాడు. అలాగే పలు కుటుంబాలకు కూరగాయలు కూడా అందజేశారు. వారిలో ధైర్యం నింపాడు. వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫీవర్ సర్వే చేసి, తనవంతు పాత్ర పోషించాడు. ఇప్పుడు కూడా క్రమం తప్పకుండా లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్నాడు.

ఎప్పటికీ మరచిపోం



కరోనా సోకినప్పుడు మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. అప్పుడు పరిస్థితులు అలా ఉన్నాయి. వలంటీర్ ధైర్యంగా ఇంటికాడికి వచ్చి ఏం భయపడొద్దంటూ మాకు ధైర్యం చెప్పాడు. ఇంటి చుట్టూ బ్లీచింగ్ పౌడర్ చల్లాడు. మాకు కావాల్సిన మందులు, కూరగాయలను ఇంటికే తెచ్చిచ్చాడు. ఈరోజు మేము ఉన్నామంటే అతడి చలవే. వలంటీర్ల సేవలను ఎప్పటికీ మరచిపోం.

–సుశీలమ్మ, తీర్థం

గ్రూపు మహిళలతోనే వీఓల బలోపేతం

పలమనేరు: గ్రామసమాఖ్యలు బలోపేతమైతే మండల సమాఖ్య సమర్థవంతంగా ఉటుందని, ఇదంతా గ్రూపు మహిళల చేతుల్లోనే ఉందని పలమనేరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాలాజినాయుడు అన్నారు. మండలంలోని మండిపేట కోటూరులో సోమవారం వెలుగు సమాఖ్య సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం మహిళలను పూర్తిగా దగా చేసిందని, పార్టీ, ఇతర సమావేశాలకు సైతం వారిని వాడుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనలో మహిళా గ్రూపులు ఆర్థికంగా ముందుకెళ్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో వెలుగు సీసీలు విజయకుమారి, శాంతమ్మ, వీఓ లీడర్లు, సంఘమిత్రలు, గ్రూపు లీడర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలాజినాయుడు

వర్గీకరణ జోలికొస్తే తడాఖా చూపుతాం

పుంగనూరు: ఎవరైనా ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే వారికి తమ తడాఖా చూపిస్తామని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్ఆర్.అశోక్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నూతన పార్టీ బీసీవైపీ అధ్యక్షుడు మాదిగ రిజర్వేషన్ పోరాటానికి మద్దతు ఇస్తామని పార్టీ ఆవిష్కరణలో ప్రకటించడంపై దళిత నేతలు మండిపడ్డారు. వర్గీకరణ జోలికొస్తే మాలల సత్తా చూపిస్తామని, ఆ పార్టీ వారిని రాష్ట్రంలో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో దళిత నాయకులు రాజు, పెంచుపల్లి కృష్ణ, నారాజు, పరమేష్, భాస్కర్, మంజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అశోక్

టెన్త్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహకాలు


రోసా సంస్థ పంపిణీ చేసిన చెక్‌లను చూపుతున్న విద్యార్థులు

రొంపిచెర్ల: పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 9మంది విద్యార్థులకు రోసా అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి సోమవారం రూ.1.16 లక్షల నగదు ప్రోత్సాహకాలను చెక్కుల రూపేణా పంపిణీ చేశారు. బాలు ర ఉన్నత పాఠశాలలో 570 మార్కులు పైచిలుకు సాధించిన విద్యార్థులకు రూ.లక్ష విరాళం అందజేస్తామని ప్రకటించారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన వారికి కూడా నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాసాయం కోసం తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. అలాగే పూర్వ విద్యార్థి, తిరుపతి రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు రామమోహన్‌రెడ్డి బాలుర ఉన్నత పాఠశాలకు ఒక కంప్యూటర్‌ను వితరణ చేశారు. తిరుపతి డీవైఈఓ ఆనందరెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు వెంకటరమణారెడ్డి, రమేష్, నరసింహులు, కిషోర్, మునిరాజ, వెంకటేష్, టీచర్లు పాల్గొన్నారు.